నమస్తే తెలంగాణ
# నిజామాబాద్
5 | నిజామాబాద్, శనివారం 27 జూలై 2024 | NIZAMABAD



## కాంగ్రెస్ ఇచ్చింది గాడిద గుడ్డే..

వినాయక్‌నగర్, జూలై 26: రాష్ట్ర బడ్జెట్‌లో ఇందూరుకు తీవ్ర అన్యాయం జరిగిందని బీజేపీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం చేశారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు దినేశ్ మాట్లాడుతూ గల్ఫ్ దేశాలకు వెళ్లిన వలస కార్మికుల కోసం ఎలాంటి నిధు లు కేటాయించలేదన్నారు. జిల్లాలోని నిజామాబాద్ రూరల్, బోధన్, ఆర్మూర్, బాల్కొండ నియోజకవర్గాల అభివృద్ధికి కాంగ్రెస్ ప్రభుత్వ ఇచ్చింది గాడిద గుడ్డేనని విమర్శించారు. కార్యక్రమంలో బీజేపీ మండల నాయకులు, కార్పొరేటర్స్, నగర నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బడ్జెట్‌పై ప్రజాగ్రహం

**కేటాయింపులపై మండిపడ్డ జనం**

- ఉమ్మడి జిల్లాలో వెల్లువెత్తిన నిరసనలు
- రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మల దహనం
- హామీల అమలులో కాంగ్రెస్ విఫలమైందంటూ విమర్శలు


**అసెంబ్లీలో రాష్ట్ర ప్రభుత్వం** ప్రవేశపెట్టిన బడ్జెట్‌పై ఉమ్మడి జిల్లాల్లో సర్వత్రా ఆగ్రహం వ్యక్తమవుతున్నది. ఆరు గ్యారెంటీల పేరిట అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్.. వాటిని అమలు చేయడంలో విఫలమైందని విమర్శలు వెల్లువెత్తాయి. నిజామాబాద్, కామారెడ్డి జిల్లాలకు బడ్జెట్ కేటాయింపుల్లో అన్యాయం జరిగిందంటూ మండల కేంద్రాల్లో రాష్ట్ర ప్రభుత్వ, సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మలను శుక్రవారం దహనం చేశారు. విద్యార్థి, కార్మిక సంఘాలతోపాటు భారతీయ జనతా పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు నిర్వహించారు. నిరుద్యోగ భృతి, రైతు కూలీలకు రూ.12వేలు, 18ఏండ్లు నిండిన యువతులకు స్కూటీలు, రైతుభరోసా రూ.15వేలు తదితర అంశాలపై బడ్జెట్‌లో కేటాయింపులను నిరసిస్తూ ఆందోళన చేపట్టారు.



బాన్సువాడలో ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

## ఖైదీలకు రూ.150... విద్యార్థులకు 30 రూపాయలా?

ఆర్మూర్‌టౌన్, జూలై 26: ఆర్మూర్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద యూఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. విద్యారంగానికి కేంద్రం 2.3శాతం బడ్జెట్ కేటాయించడంపై మండిపడ్డారు. రాష్ట్రంలో మెస్ చార్జీలు ఒక్కో విద్యార్థికి రూ.30 ఇస్తున్నారని, జైల్లో ఉండే ఖైదీకి మాత్రం రూ.150 ఖర్చు చేస్తున్నట్లు విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు.



ఆర్మూర్‌లో కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న యూఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

## ఆటో కార్మికుల భృతి ఎక్కడ?

ఖలీల్‌వాడి, జూలై 26: జీవనభృతిపై బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడంతో ఆటో డ్రైవర్లు మండిపడ్డారు. నిజామాబాద్ నగరంలో సీఐటీయూ ఆధ్వర్యంలో ఆటో డ్రైవర్లు నిరసన తెలిపారు. మహిళలకు ఫ్రీ బస్సు ప్రయాణంతో ఆటో కార్మికుల ఉపాధి దెబ్బతిన్నదని, ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రూ.12వేల భృతిని అందించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు కటారి రాములు, సభ్యులు ముజీబ్, ప్రభాకర్, లక్ష్మణ్, అబ్దుల్ తదితరులు పాల్గొన్నారు.



నిజామాబాద్‌లో నిరసన తెలుపుతున్న ఆటో కార్మికులు



## టీయూలో బడ్జెట్ ప్రతుల దహనం..

డిచ్‌పల్లి, జూలై 26: బడ్జెట్‌లో విద్యారంగానికి కేవలం 7.3శాతం నిధులు కేటాయించడంపై నిరసన తెలుపుతూ ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో టీయూ బస్టాండ్ ఆవరణలో బడ్జెట్ ప్రతులను దహనం చేశారు. యూనివర్సిటీలన్నీ రూ.500కోట్లతో ఎలా అభివృద్ధి చెందుతాయని ఆవేదన వ్యక్తంచేశారు. టీయూకు నామమాత్రపు నిధులు కేటాయించడం సిగ్గుచేటన్నారు. ఎమ్మెల్యే భూపతిరెడ్డి కలుగజేసుకొని తెలంగాణ యూనివర్సిటీకి రూ.200కోట్ల నిధులను తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఎఫ్‌ఐ టీయూ ఉపాధ్యక్షుడు చిత్రు, మధు, రఘు, శ్రీనివాస్ పాల్గొన్నారు



ఎల్లారెడ్డిలో సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం చేస్తున్న బీజేపీ నాయకులు

## మా జిల్లాకు నిధులేవి?

ఎల్లారెడ్డి రూరల్/ బాన్సువాడ, జూలై 26: కామారెడ్డి జిల్లాకు, ఎల్లారెడ్డి నియోజకవర్గ అభివృద్ధికి నిధులు కేటాయించకపోవడంపై బీజేపీ నాయకులు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఎల్లారెడ్డి పట్టణంలోని గాంధీచౌక్‌లో, బాన్సువాడలో సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేశారు. జిల్లాలో ముగ్గురు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు ఉన్నా అభివృద్ధికి మాత్రం ఏమాత్రం నిధులు రాలేదన్నారు. బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి రవీందర్‌రావ్, మండల అధ్యక్షుడు పెద్దెడ్ల నర్సింహులు, పట్టణ అధ్యక్షుడు సతీశ్, కన్వీనర్ లింగారావ్ పాల్గొన్నారు. బాన్సువాడలో నిర్వహించిన కార్యక్రమంలో బీజేపీ నాయకులు శ్రీనివాస్, కోనాల గంగారెడ్డి, సాయి కిరణ్, హన్మాండ్లు, గోపాల్ పాల్గొన్నారు.

## రోడ్లపై చెత్తవేస్తే జరిమానా విధించండి

**మున్సిపల్ అధికారులకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశం**

కామారెడ్డి, జూలై 26 : రోడ్లపై ఎవరైనా చెత్తవేస్తే జరిమానా విధించాలని మున్సిపల్ అధికారులకు కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్ ఆదేశించారు. పట్టణ పరిధిలోని ఇందిరానగర్ కాలనీ డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద శుక్రవారం ఆయన డ్రైడే ఫ్రైడే కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమాన్ని కలెక్టర్ పరిశీలించారు. డబుల్ బెడ్‌రూం ఇండ్ల వద్ద ముళ్ల పొదలు, మురికి కాలువలను శుభ్రం చేయాలని మున్సిపల్ అధికారులకు సూచించారు. రామారెడ్డి రోడ్డుకు ఇరువైపులా ఉన్న మురికి కుప్పలను తొలగించి మొక్కలు నాటాలని అన్నారు. రంగవల్లులు వేయించాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గడ్డం ఇందుప్రియ, మున్సిపల్ కమిషనర్ సుజాత, కౌన్సిలర్లు, మున్సిపల్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



మురుగు కాలువలను పరిశీలిస్తున్న కలెక్టర్ ఆశీష్ సంగ్వాన్

## ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పొద్దు

- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు
- రెంజల్ మండలంలో ఆకస్మిక తనిఖీ
- అమ్మ ఆదర్శ పాఠశాలల పనులపై అసంతృప్తి



రెంజల్‌లో గ్యాస్ సబ్సిడీ జమ కావడంలేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న బాధితుడు సాయిలు

రెంజల్, జూలై 26: మండలంలోని రెంజల్, వీరన్నగుట్ట గ్రామాల్లో కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు శుక్రవారం పర్యటించారు. ప్రభుత్వ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల మరమ్మతు పనులను, ఎంపీడీవో కార్యాలయంలో ఏర్పాటు చేసిన ప్రజాపాలన కేంద్రాన్ని పరిశీలించారు. రెంజల్ గ్రామానికి చెందిన సాయిలు తనకు సబ్సిడీ గ్యాస్ డబ్బులు ఖాతాలో జమకావడం లేదని కలెక్టర్‌కు ఫిర్యాదు చేశాడు. ప్రజాపాలన దరఖాస్తుల్లో సాంకేతిక సమస్యలు వస్తే తన దృష్టికి తీసుకురావాలని, ప్రజలను కార్యాలయాల చుట్టూ తిప్పుకొంటూ ఇబ్బంది పెట్టొద్దని ఎంపీడీవోకు కలెక్టర్ సూచించారు. వీరన్నగుట్ట, రెంజల్ గ్రామాల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పనులు నత్తనడకన సాగడంపై కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. వీరన్నగుట్ట పాఠశాలలో బోధన, విద్యార్థులకు మౌలిక వసతులపై కలెక్టర్ ఆరా తీశారు. పాఠశాలల సమయంలో కందకుర్తి, తాడ్‌బిలోలికి నిజామాబాద్-2 డిపో అధికారులు బస్సులు నడపక పోవడంతో పాఠశాలకు ఆలస్యం అవుతోందని, ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లినా సమస్య పరిష్కారం కాలేదని విద్యార్థులు కలెక్టర్‌కు చెప్పారు. రెంజల్‌లో మిషన్ భగీరథ తాగునీరు రావడంలేదని పలువురు ఫిర్యాదు చేయడం, పీహెచ్‌సీ, ప్రాథమిక పాఠశాలలో పిచ్చి మొక్కలు కనిపించడంతో కలెక్టర్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రెండు రోజుల్లో సమస్యలు పరిష్కరించాలని ఎంపీడీవో, ఎంపీవోను కలెక్టర్ ఆదేశించారు. రెంజల్ ప్రాథమిక పాఠశాలలో శిథిలావస్థలో ఉన్న గదులు కూలి విద్యార్థులకు ప్రమాదం జరిగే వరకు వాటిని కూల్చివేయరా అంటూ ఎంఈవోపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తంచేశారు. అమ్మ ఆదర్శ పాఠశాలల పనులను వారంలో రెండు రోజులు తనిఖీ చేయాలని మండల ప్రత్యేక అధికారి వాజిద్ హుస్సేన్‌ను ఆదేశించారు. వన మహోత్సవంలో భాగంగా రెంజల్ ఆదర్శ, ప్రాథమిక పాఠశాలల ఆవరణలో నాటిన మొక్కలకు నీరు పోశారు. వాటిని కాపాడుకోవాలని సిబ్బందికి సూచించారు. కలెక్టర్ వెంట డీఏవో వాజిద్‌హుస్సేన్, డీఆర్డీవో సాయాగౌడ్, పీఆర్ ఈఈ శంకర్‌నాయక్, ఎంపీడీవో శ్రీనివాస్, తహసీల్దార్ శ్రావణ్‌కుమార్, పీఆర్ డీఈ రాజయ్య, ఎంఈవో గణేశ్‌రావు, ఏవో లక్ష్మీకాంత్‌రెడ్డి, ప్రిన్సిపాల్ బలరాం తదితరులు ఉన్నారు.

## ఉప్పొంగిన దేశభక్తి

కార్గిల్ విజయ్ దివస్ సందర్భంగా కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం బోధన్ పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు, బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో అతిపెద్ద జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహించారు. యుద్ధంలో ప్రాణాలర్పించిన వీర సైనికులకు శ్రద్ధాంజలి ఘటించారు. దేశ ప్రజల రక్షణ కోసం పోరాడి అసువులు బాసిన వీర జవాన్లను స్మరించుకున్నారు.
- బోధన్, జూలై 26



బీఆర్‌ఎస్వీ ఆధ్వర్యంలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ నిర్వహిస్తున్న విద్యార్థులు






కేంద్ర సమాచార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎన్‌సీసీ కెడెట్లు

## కేసీఆర్ చేసిన మేలు మర్చిపోను..

**మాజీ స్పీకర్ పోచారం శ్రీనివాసరెడ్డి**



కోటగిరిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పోచారం, పక్కన ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజు

బాన్సువాడ/కోటగిరి, జూలై 26: పార్టీ మారినప్పటికీ తెలంగాణ తొలి సీఎం కేసీఆర్ చేసిన మేలును తాను మరిచిపోనని మాజీ స్పీకర్, బాన్సువాడ ఎమ్మెల్యే పోచారం శ్రీనివాసరెడ్డి అన్నారు. కేసీఆర్ సహకారంతోనే నియోజకవర్గాన్ని అభివృద్ధి చేశానని గుర్తుచేశారు. కేసీఆర్ సహకారంతో రాష్ట్రంలోనే ఎక్కడా లేని విధంగా 11 వేల ఇండ్లను మంజూరు చేయించానన్నారు. రాజకీయ పరిణామాలను దృష్టిలో ఉంచుకొని పార్టీ మారాల్సి వచ్చిందన్న ఆయన.. నియోజకవర్గ అభివృద్ధికి అన్ని విధాలుగా సహకరించిన కేసీఆర్‌కు, నిధులు తెచ్చుకున్న తనకు పార్టీ మారినందున బాధ ఉండవచ్చని వ్యాఖ్యానించారు. రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజుతో కలిసి శుక్రవారం బాన్సువాడ, కోటగిరి మండలాల్లో డబుల్ బెడ్రూం ఇండ్ల లబ్ధిదారులకు పోచారం చెక్కులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.. నియోజకవర్గ అభివృద్ధి, ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని బీఆర్‌ఎస్‌ను వీడి కాంగ్రెస్ పార్టీలో చేరానన్నారు. కేసీఆర్ హయాంలో నియోజకవర్గంలో రూ.550 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. అంతేకాకుండా డిస్ట్రిబ్యూటరీల మరమ్మతులకు రూ.150 కోట్లు, ఎత్తిపోతల పథకాలకు రూ.150 కోట్లతోపాటు రూ.160 కోట్లతో చందూర్ లిఫ్ట్, రూ.200 కోట్లతో సిద్ధాపూర్ రిజర్వాయర్ పనులు చేపట్టామన్నారు. అసంపూర్తిగా ఉన్న పనులను పూర్తి చేసి రిటైర్ అవ్వాలనే ఆలోచనతోనే పార్టీ మారినట్లు చెప్పారు. నియోజకవర్గ నిధుల కోసమే చేరుతున్నట్లు సీఎం రేవంత్‌రెడ్డికి చెప్పానన్నారు. బాన్సువాడ నియోజకవర్గ అభివృద్ధిలో పోచారం శీనన్నది పెద్దన్న పాత్ర అని రాష్ట్ర ఆగ్రో ఇండస్ట్రీస్ కార్పొరేషన్ చైర్మన్ కాసుల బాల్‌రాజ్ కొనియాడారు. నియోజకవర్గ అభివృద్ధి, సంక్షేమం కోసమే కాంగ్రెస్‌లో చేరారని, కష్టకాలంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఒప్పించి పాత డబుల్ బెడ్‌రూం ఇండ్ల బిల్లులను తెచ్చి పేదలకు అందిస్తున్నారన్నారు. పోచారం సురేందర్‌రెడ్డి మున్సిపల్ చైర్మన్ జంగం గంగాధర్, సొసైటీ అధ్యక్షుడు వై.కృష్ణారెడ్డి, మహ్మద్ ఎజాస్, గోపాల్‌రెడ్డి, ఏఎంసీ మాజీ చైర్మన్ నార్ల సురేశ్ గుప్తా, మాజీ జడ్పీటీసీ శంకర్ పటేల్, కోఆప్షన్ సభ్యుడు సిరాజ్, మాజీ ఎంపీపీ శంకర్ పాల్గొన్నారు.

## నీటి తొట్టిలో పడి బాలుడు మృతి



కన్నయ్య మృతదేహం

సిరికొండ,జూలై 26: ప్రమాదవశాత్తు నీటి తొట్టిలో పడి బాలుడు మృతి చెందిన ఘటన సిరికొండ మండలం ధూప్యాతండాలో శుక్రవారం చోటు చేసుకున్నది. గ్రామానికి చెందిన మలావత్ గజేందర్‌లికిత దంపతుల మొదటి కుమారుడు కన్నయ్య (2) రోజూ మాదిరిగా ఆడుకుంటూ ఇంటి ఎదుట ఉన్న నీటి తొట్టిలో పడిపోయాడు. కుటుంబసభ్యులు వెళ్లి చూసేసరికి నీరు మింగి మృతి చెందాడు. బాలుడి మృతితో తండాలో విషాదఛాయలు అలుముకున్నాయి.